8వ లక్కీ డ్రాను లక్డీకాపూల్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ జోనల్ ఆఫీస్‌లో డ్రా తీస్తున్న బ్యాంక్ జనరల్ మేనేజర్ దీపక్‌కుమార్ శ్రీవాస్తవ, ఇతర అధికారులు, నమస్తే తెలంగాణ జనరల్ మేనేజర్ సురేందర్ రావు, డిప్యూటీ మేనేజర్ సంజు రావు

పండుగ వేళ.. బహుమతుల పంట

ఉత్సాహంగా సాగుతున్న నమస్తే దసరా బొనాంజా వేడుకలు.. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో సందడిగా లక్కీ డ్రా

ఖైరతాబాద్, అక్టోబర్ 17 : పండుగ వేళ.. బహుమతుల పంట పండుతున్నది. 'నమస్తే తెలంగాణ'–'తెలంగాణ టుడే'ల సంయుక్తాధ్వర్యంలో జరుగుతున్న దసరా బొనాంజా వేడుకలు వినియోగదారులకు రెట్టింపు ఉత్సాహాన్ని అందిస్తున్నాయి. ప్రతి ఏటా సాగుతున్న ఈ దసరా బొనాంజాలో ఎంపిక చేసిన షాపింగ్ మాల్స్, వ్యాపార కేంద్రాల్లో చేసే కొనుగోళ్లపై కూపన్లను అందిస్తున్నారు. డ్రా తీసి విజేతలను ఎంపిక చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం లక్డీకాపూల్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంకులో 8వ లక్కీ డ్రా కార్యక్రమం ఆద్యంతం సందడిగా సాగింది. ఐదుగురు విజేతలను ఎంపిక చేశారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్ జనరల్ మేనేజర్ దీపక్‌కుమార్ శ్రీవాస్తవ మొదటి డ్రా తీయగా, మిగిలిన డ్రాలను డిప్యూటీ జనరల్ మేనేజర్ రాజీవ్‌సింగ్ ఝా, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు ఆర్‌కె సిన్హా, ఎస్.వెంకట్ కృష్ణన్, చీఫ్ మేనేజర్ వై.రాజేశ్, 'నమస్తే తెలంగాణ' జనరల్ మేనేజర్ సురేందర్‌రావు తీశారు. ఈ కార్యక్రమంలో 'నమస్తే తెలంగాణ' అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు రాజిరెడ్డి, డిప్యూటీ మేనేజర్లు శ్రీకాంత్, సంజు రావు పాల్గొన్నారు.

లక్కీ విజేతలు వీరే..

మంగళవారం నాటి డ్రాలో మొదటి బహుమతిని సీఎంఆర్ షాపింగ్ మాల్‌లో చీరను కొనుగోలు చేసిన రెడ్డి భిక్షం (కూ.నం.108271) 32 ఇంచుల ఎల్‌ఈడీ టీవీ, 2వ బహుమతిని చర్మాస్‌లో షాపింగ్ చేసిన ఎ.రోహిత్ (కూ.నం. 106593) మొబైల్ ఫోన్, 3వ బహుమతిని వెంకటరమణ మోటార్స్‌లో కారు బుక్ చేసిన తెన్నేటి ఇంద్రదేవ్(కూ.నం.69239) మైక్రో ఓవెన్, 4వ బహుమతిని ఆర్వీ టూర్స్ ట్రావెల్స్‌లో బుక్ చేసిన కె.జ్యోతి (కూ.నం.94219) రూ.5వేల గిఫ్ట్ ఓచర్, 5వ బహుమతిని ఎ.వసంత (కూ.నం.50436) రూ.5వేల గిఫ్ట్ ఓచర్లు గెలుచుకున్నారు. ఈనెల 20వ తేదీన నగరంలో జరిగే ఈవెంట్‌లో బంపర్ బహుమతిగా నిస్సాన్ మాగ్నెట్ కారును దక్కించుకునే విజేతను ఎంపిక చేస్తారు.

మూడేండ్లుగా 'నమస్తే'తో కలిసి..

తెలంగాణ ఇంటి పత్రిక 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే'తో మాకు మూడేండ్ల అనుబంధం ఉన్నది. గత మూడేండ్లుగా దసరా బొనాంజాలో భాగస్వాములం కావడం సంతోషంగా ఉన్నది. దేశంలోనే రెండో అతిపెద్ద పబ్లిక్ సెక్టార్ బ్యాంక్‌గా పంజాబ్ నేషనల్ బ్యాంకు విరాజిల్లుతున్నది. తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, కర్నాటకలో రూ.60వేల కోట్ల ఆదాయంతో దూసుకుపోతున్నది. వినియోగదారులకు డిపాజిట్, వివిధ రకాల రుణాలు అందిస్తూ అత్యుత్తమ సేవలందిస్తున్నది. 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' పత్రికలు ప్రజలకు విలువైన సమాచారాన్ని చేరవేయడమే కాకుండా దసరా బొనాంజా లాంటి కార్యక్రమాలను నిర్వహించి ప్రోత్సహించడం అభినందనీయం. పండుగ సందర్భంగా బహుమతులు గెలుచుకున్న విజేతలందరికీ శుభాకాంక్షలు.

- దీపక్ కుమార్ శ్రీవాస్తవ, జనరల్ మేనేజర్, పంజాబ్ నేషనల్ బ్యాంక్

బంపర్ బహుమతిగా నిస్సాన్ మెగ్నెట్ కారు

'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' దసరా బొనాంజాకు విశేష స్పందన లభిస్తున్నది. నిర్ధేశిత షాపింగ్ మాల్స్, వ్యాపార కేంద్రాల్లో షాపింగ్ చేసిన వారికి కూపన్లు అందించి తద్వారా లక్కీ డ్రాలో గెలుపొందిన వారికి విలువైన బహుమతులను అందిస్తున్నాం. ప్రతిరోజు 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' పత్రికలు చూసి సంబంధిత వ్యాపార కేంద్రాల్లో షాపింగ్ చేసి ఈ డ్రాలో పాల్గొనవచ్చు. ఎనిమిదో లక్కీ డ్రాలో గెలుపొందిన విజేతలకు శుభాకాంక్షలు. ఈ నెల 20వ తేదీన నిర్వహించే బంపర్ డ్రాలో నిస్సాన్ మెగ్నెట్ కారును బహుమతిగా అందిస్తాం.

- సురేందర్ రావు, జనరల్ మేనేజర్, నమస్తే తెలంగాణ

సమగ్ర సమాచార దర్శిని 'నమస్తే'

'నమస్తే తెలంగాణ' దిన పత్రికను రెగ్యులర్‌గా చదువుతాను. తెలంగాణలోని మారుమూల ప్రాంతాల్లో జరిగే అంశాలను విపులంగా అందిస్తారు. కరెంట్ అఫైర్స్, వర్తమాన అంశాలు సమగ్రంగా అందిస్తున్నారు. విద్య, ఉద్యోగాలకు సంబంధించి విలువైన సమాచారం అందుకుంటున్నాం. నిపుణులో పోటీ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్ చాలా బాగుంటుంది. 'నమస్తే తెలంగాణ' దసరా బొనాంజా మొదటి బహుమతిని అందుకోవడం చాలా సంతోషంగా ఉన్నది. థ్యాంక్స్ టు 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే'.

- రెడ్డి భిక్షం, మొదటి బహుమతి విజేత

జగన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

తన పుట్టినరోజును పురస్కరించుకొని సీఎం కేసీఆర్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్న టీఎస్‌టీఎస్ చైర్మన్ పాటిమీది జగన్మోహన్‌రావు.

- సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ)

స్త్రీశక్తి అవార్డుల ప్రదానం

తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ(టీసీఈఐ)ఆధ్వర్యంలో 6వ సీబీఎస్ షాపింగ్‌మాల్ 'స్త్రీశక్తి అవార్డ్స్–2023' కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ హాజరై మహిళలకు బహుమతులు అందజేశారు. స్త్రీశక్తి, స్త్రీమూర్తి, స్త్రీరత్న అనే మూడు కేటగిరీల్లో మహిళలను అవార్డులతో సత్కరించారు. మొత్తం టీసీఈఐ అధ్యక్షుడు ఎ.బాల్‌రామ్‌తోపాటు పలువురు మహిళా ప్రముఖులు పాల్గొన్నారు.

– శేరిలింగంపల్లి, అక్టోబర్ 17

50 ఇన్‌స్పైరింగ్ విమెన్ పుస్తకావిష్కరణ

రాష్ట్రంలో వివిధ రంగాల్లో తమదైన పాత్రను పోషిస్తూ ప్రతిభ చాటుతూ స్ఫూర్తిదాయకంగా నిలిచిన మహిళా ప్రముఖుల కథనాలు, వారి ఫొటో చిత్రాలతో '50 ఇన్‌స్పైరింగ్ విమెన్' తెలంగాణ ఎడిషన్ పేరుతో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన పుస్తకావిష్కరణ మంగళవారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. పవన్ మోటర్స్ డైరెక్టర్ కీర్తిరెడ్డి, క్యూరేషన్ బృంద ప్రతినిధులు రతీశ్ కృష్ణన్, హుర్షిత సింగరి, పెటెంట్, ఫొటోగ్రాఫర్ అమర్ రమేశ్‌లతోపాటు పలువురు ప్రముఖులు ప్రత్యేక అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో క్యూరేషన్ బృంద ప్రతినిధులు ముఖేష్ అమరన్, భవనేశ్వరీ, రమ్య మురుగానందం తదితర మహిళా ప్రముఖులు పాల్గొన్నారు.

- శేరిలింగంపల్లి, అక్టోబర్ 17

నేడు మేడ్చల్‌లో సీఎం బహిరంగ సభ

లక్ష మందితో నిర్వహించేలా సన్నాహాలు

ఏర్పాట్లు పూర్తి.. సభాస్థలిని పరిశీలించిన మంత్రి మల్లారెడ్డి, జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు శంభీపూర్ రాజు

మేడ్చల్, అక్టోబర్17(నమస్తే తెలంగాణ): మేడ్చల్‌లో బుధవారం జరిగే ప్రజా ఆశ్వీరాద సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొననున్నారు. మేడ్చల్‌లోని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు సర్వం సిద్ధమైంది. లక్ష మందితో సభ నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే మేడ్చల్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు, బీఆర్ఎస్ శ్రేణులతో మంత్రి మల్లారెడ్డి సమావేశమై జనసమీకరణ చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. 15 ఎకరాల విస్తీర్ణంలో సీఎం కేసీఆర్ సభ జరగనున్నది. సభా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలతో గూలాబీమయంగా మారింది. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా కుర్చీలను ఏర్పాటు చేసి తాగునీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. సీఎం కేసీఆర్ బహిరంగ సభకు పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

సభాస్థలిలో ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి, శంభీపూర్ రాజు

మేడ్చల్‌లోని సభాస్థలిని మంత్రి మల్లారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు పరిశీలించారు. ఇరువురు సభా ప్రాంగాణాన్ని పరిశీలించి ఏర్పాట్లపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మండలాల, మున్సిపాలిటీ పరిధిలోని ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతలతో సమావేశమై సీఎం బహిరంగ సభ విజయవంతమయ్యేలా చూడాలని కోరారు.

లక్ష మందితో సభ నిర్వహిస్తాం

మేడ్చల్‌లో జరిగే ప్రజా ఆశ్వీరాద సభను లక్ష మందితో నిర్వహిస్తాం. సీఎం కేసీఆర్ పాల్గొనే బహిరంగ సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేస్తాం. తొమ్మిదేండ్ల కాలంలో సీఎం కేసీఆర్ రాష్ట్రాభివృద్ధిని చూసి ప్రజలందరూ బీఆర్ఎస్ వైపే ఉన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ పథకాల హామీలపై రాష్ట్ర ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- మంత్రి మల్లారెడ్డి

సభను విజయవంతం చేయాలి

మేడ్చల్‌లో నేడు జరిగే సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేసి సీఎంకు మద్దతు తెలపాలి. ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ పథకాల అమలు హామీలపై విడుదల చేసిన మ్యానిఫెస్టోతో రాష్ట్రంలోని ప్రజలకు న్యాయం జరిగేలా ఉంది. సీఎం బహిరంగ సభ ఏర్పాట్లలో మంత్రి మల్లారెడ్డితోపాటు కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

- శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, విప్

మేడ్చల్‌లో జరిగే సీఎం కేసీఆర్ బహిరంగ సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీస్తున్న మంత్రి మల్లారెడ్డి, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు